# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 64 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

25-12-2025 గురువారం వెల : 1/- పేజీలు : 4




# అయ్యో...ఆదిత్య...

# మాకన్నీటి గాథ వినయ్య

- వేధిస్తున్న కాంట్రాక్టర్
- మా కష్టం నుండి రక్తపు చుక్కలు కావాలంట
- ప్రతి నెల లంచమిస్తే గాని జీతాలు ఇవ్వడంట
- ఈవో అండదండలతో కాంట్రాక్టర్ బెదిరింపులు
- సేవ కోసం అంటూ కాంట్రాక్ట్ తీసుకున్న వైనం
- ఎమ్మెల్యే గారు కాస్త దృష్టి సారించండి

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది నేడు వారి కన్నీటి గాధను ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడు వినాలని వేడుకుంటున్నారు. మీ జీతం నుంచి రూపాయి అవసరం లేదంటూ కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి నేడు తమ జీవితంలో ప్రతినెల లంచం ఇస్తే గాని జీతం ఇవ్వనని బెదిరింపులు దిగడంతో కాంట్రాక్టు ఉద్యోగులంతా నరకయాతన పడుతున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే కాంట్రాక్టు విషయంలో స్పష్టమైన వివరణతో కూడిన నివేదిక ఉండాలని అలానే జాబితా తయారు చేయాలని చెప్పినప్పటికీ... ఈవో పట్టించుకోకుండా తనకి కావలసిన వారికి సిబ్బంది జీతాల విషయంలో కాంట్రాక్టు ఇప్పించి నేడు వారి జీతాలు విషయంలో నానా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని నవతరం పత్రిక విలేకరులకు సిబ్బంది తెలియజేయడం జరిగింది...

అరసవిల్లి లో జరుగుతున్న అవినీతి... రథసప్తమి పేరుతో జరుగుతున్న... లక్షల్లో దోచుకోవడం త్వరలో మీ ముందుకు నవతరం పత్రిక బయటపడుతుంది....

## సాహిత్య అకాడమీలో
# కేంద్రం జోక్యం తగదు

### అరసం తీవ్ర నిరసన

**నవతరం -శ్రీకాకుళం:**

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల ప్రకటనలో తలదూర్చడం సరికాదని. దేశంలోని అన్ని వ్యవస్థల స్వయంప్రతిపత్తిని హరించడమే కాకుండా వాటిని తన దయదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తోందని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (పీడబ్ల్యూఏ) జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావులు ధ్వజమెత్తారు. అన్ని వ్యవస్థలు, వ్యక్తులను తమ నియంత్రణలో ఉంచడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ అణచివేత పద్ధతిని కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు విస్తరిస్తోందని, జాతీయ సాంస్కృతిక, సాహిత్య వ్యవస్థల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడమంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఈ విషయంలో వెనక్కు తగ్గకపోతే దేశవ్యాప్త ఉద్యమం తప్పబోదని హెచ్చరిస్తూ ఒక ప్రకటనను పీడబ్ల్యూఏ తాజాగా విడుదల చేసింది. ప్రతిష్టాత్మక సాహిత పురస్కారాల్లో జోక్యం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. లేని పక్షంలో జాతీయ స్థాయి ప్రతిఘటన తప్పదంటూ హెచ్చరించారు. 'న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన పేర్లను ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదంతో అకాడమీ కార్యదర్శి ప్రకటించడం ఆనవాయితీ కాగా ఇందులో ప్రభుత్వ జోక్యానికి తావులేదు. కానీ ఇప్పుడు ఎంపిక చేసిన పేర్లను పరిశీలించిన తర్వాత విజేతలను ప్రభుత్వ ప్రతినిధి ప్రకటిస్తారని సర్కారు పేర్కొంది. ఇలా చేయడం. అప్రజాస్వామికం. కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం' అని ఎద్దేవా చేశారు. తమ జోక్యంతో ఈ పద్ధతి మరింత పారదర్శకంగా సాగుతుందని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం తరపున జరుగుతున్నాగానీ... ఇది ప్రఖ్యాత అకాడమీ పురస్కారాలను రాజకీయం చేసే ప్రయత్నమని అందరికీ అర్థమవుతోందని వ్యాఖ్యానించారు.

సర్కారుకు అనుకూలంగా ఉన్న వారికి అవార్డులు ఇచ్చే అవకాశం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అకాడమీ పురస్కారం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, ఏటా 24 భాషల విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. నేరుగా జోక్యం చేసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడం... సాహిత్య రంగ స్వయంప్రతిపత్తికి, భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నిరంకుశ నిర్ణయాన్ని అకాడమీ వ్యతిరేకిస్తుందని ఆశిస్తున్నామని, లేకపోతే అకాడమీ వ్యవస్థాపకులకు ద్రోహం చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు.

## డిజిటల్ న్యాయ పాలన ద్వారా
# సమర్థ, సత్వర పరిష్కారం



2లో

## క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రజలకు మంత్రి అచ్చెన్నాయుడు
# శుభాకాంక్షలు



**నవతరం - నిమ్మాడ**

క్రిస్మస్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా క్రైస్తవ సోదరసోదరీమణులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, త్యాగం, క్షమ వంటి విలువలు సమాజానికి శాశ్వత మార్గదర్శకాలని పేర్కొన్నారు. మానవత్వానికి ప్రతీకగా నిలిచిన క్రీస్తు జీవితం, ప్రతి ఒక్కరిలో సేవాభావాన్ని, సహనం మరియు శాంతిని పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. క్రిస్మస్ పండుగ ప్రపంచానికి శాంతి, సౌహార్దం, సోదరభావం అనే సందేశాన్ని అందిస్తుందని, ఈ పవిత్ర సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. మతభేదాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా జీవిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రిస్మస్ పండుగ రాష్ట్రానికి సుఖశాంతులు, సమృద్ధి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ
# సంక్షేమ పథకాలు అందిస్తాం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**నవతరం - నిమ్మాడ**



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయన్నారు. సంతబొమ్మాళి మండం కొత్తపల్లి గ్రామానికి భూ సర్వే చేపట్టాలని వినత పత్రం అందిందించారు. అలాగే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం లేకుండా, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## జిల్లాలో 26వేల మెట్రిక్ టన్నుల
# ఎరువుల పంపిణీకి ప్రణాళిక

### జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**నవతరం -శ్రీకాకుళం:**



జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేదని, రైతులకు అవసరమైన యూరియాను తగినంతగా అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. 2025-26 రబీలో అన్ని రకాల పంటలకు గాను మొత్తం 26,000 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 1 నుంచి ఈ నెల 23 వరకు జిల్లావ్యాప్తంగా 11,141 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయని, ప్రస్తుతం వివిధ కేంద్రాల్లో 1,859 మెట్రిక్ టన్నుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. దేశీయ ఉత్పత్తితో పాటు దిగుమతులు కూడా ఆశాజనకంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సాంప్రదాయ ఎరువులకు

-మిగతా 2లో

ఎడిటోరియల్

# 'హి' జాబ్

ఆరునెలలు సావాసం చేస్తే వారు వీరవుతారు, వీరు వారవుతారు' అనేది ఒక సామెత. ఇది అక్షరాలా వాస్తవమేనని నిరూపించారు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్. ఇంతకాలంగా బీజేపీ, సంఘ పరివార్‌తో చేతులు కలిపి, స్నేహం చేసి పదవులను భవిస్తున్నందుకు జేడీయూ నేత, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న నితీష్‌కూ వారి భావజాలము తలకెక్కి ఉంటుందనే అనిపిస్తున్నది.స్త్రీల పట్ల, ముస్లింల పట్ల వ్యవహరించే తీరు చూస్తే బీజేపీ అడుగుల్లో అడుగేస్తున్నాడని అనిపిస్తున్నది. మొన్నీ మధ్య బీహార్ రాజధాని పాట్నాలో ఆయుష్ డాక్టర్లుగా ఎంపికయిన వేయిమందికి, నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని ఒకటి నిర్వహించారు. ఆ పత్రాలను ముఖ్యమంత్రిగా ఉన్న నితీష్ ఒక్కొక్కరికి అందించే క్రమంలో, ఎంపికయిన ఓ ముస్లిం డాక్టరు నుస్రత్ పర్వీన్ నియామక పత్రాన్ని తీసుకునేందుకు వచ్చింది. ఆమె ముఖానికి హిజాబ్ ధరించింది. పత్రాన్ని ఇస్తూ సీఎం ఆమె హిజాబ్‌ను తీయమని అడగటమే కాక, వెంటనే స్వయంగా అందరిముందు అమ్మాయి హిజాబ్‌ను పట్టుకుని గుంజాడు. ఆమె బిత్తరపోయింది. వేదికపై ఉన్నవాళ్లు గొల్లున నవ్వారు. ముఖ్యమంత్రి తన చేతులతో హిజాబ్‌ను తొలగించాలని లాగడం, ఇపుడు దేశమంతా పెద్ద చర్చనీయాంశమైంది.దేశంలోనే కాదు, ప్రపంచంలోనే కూడా చర్చ, నిరసన వ్యక్తమవుతున్నది. ముస్లింలు హిజాబ్‌ను ధరిస్తరనేది అందరికీ తెలిసిన విషయమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత విశ్వాసాన్ని ప్రకటించుకునే హక్కు ఉంది. దాన్ని నిరోధించడం అంటే రాజ్యాంగ హక్కును నిరాకరించడం అవుతుంది. ఇక రెండో విషయం, ఒక మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా చర్యకు పూనుకోవడం, అదీ ముఖ్యమంత్రిగా ఉండి చేయడం నేరం అవుతుంది. అంతమంది ప్రజలముందు ఒక స్త్రీని ఇబ్బంది పెట్టడం వేధింపుల కిందికి రాదా! ఆమె ఏ బట్టలు వేసుకోవాలి, ఏది వేసుకోకూడదో నిర్దేశించడం సాంస్కృతిక పోలీసింగ్ అవుతుంది. ఆమె ఆత్మగౌరవానికి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం క్షమించరాని నేరం.ఎవరో ఒక వ్యక్తి మహిళను మనోవేదనకు గురిచేశాడంటే, అది వేరు.సాక్షత్తూ ముఖ్యమంత్రి బహిరంగంగా మహిళను అవమానపరచడాన్ని అందరూ ఖండిస్తున్నారు.ఈ ఘటన వైరల్ అయి వివాదం కాగానే కేంద్రమంత్రిగా ఉన్న బీజేపీ నాయకుడు గిరిరాజ్ సింగ్ నితీష్ చర్యను సమర్థిస్తూ మాట్లాడటం మరింత అజ్యం పోస్తోంది. "ఇదేమీ ఇస్లామిక్ దేశం కాదు. నియామక పత్రం ఇస్తున్నపుడు ముఖం చూస్తే తప్పేమిటి? తండ్రిలా ఆ పనిచేశాడు" అని సమర్థించాడు. ఇక యూపీ మంత్రి సంజయ్ నిషాద్ అయితే నవ్వుతూ దుర్మార్గమైన వ్యాఖ్యానాలు చేశాడు. అదే రాజస్థాన్, హర్యాణా స్త్రీలు వారు ధరించిన గూంగట్, ముసుగులను ముస్లిం వ్యక్తులు తొలగించి చూస్తే ఒప్పు కుంటారా? అని ఓమర్ అబ్దుల్లా వేసిన ప్రశ్న సరైనదిగానే అనిపిస్తుంది. ఈ సంఘటన జరుగుతున్న సందర్భంలోనే ఘనత వహించిన ప్రధానిగారు ఓమన్‌లో పర్యటిస్తున్నారు. అక్కడి ముస్లిం సంప్రదాయాల ప్రకారం చేసే మర్యాదల్ని స్వీకరిస్తూనే ఉన్నారు. ఇదీ వీరి ద్వంద్వ ప్రవర్తనలకు నిదర్శనం.కొందరేమో నితీష్‌కుమార్ మానసికస్థితి సరిగా లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఒక రాష్ట్రానికి పాలకుడిగా ఉన్నవాడి మానసికస్థితి బాగా లేకపోతే పాలనకే అనర్థుడు కదా! ఇది నితీష్ మానసిక స్థితే కాదు, నేటి కేంద్ర పాలకుల మానసికత అలాగే ఉంది. ప్రముఖ సినిమా నటి జైరా వాసిమ్ నితీష్ చర్యను తీవ్రంగా ఖండించారు. క్షమాపణ చెప్పాలని కోరారు. సినీనటి రాఖీసావంత్ అయితే 'నేను మీ ధోవతిని అందరి ముందు లాగితే మీకు ఎలా అనిపిస్తుంది' అంటూ నిలదీశారు. "మహిళలు సంప్రదాయంగా పాటించే పరదాని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తాను. కానీ ఒక ముస్లిం వైద్యురాలి పట్ల నితీష్ వ్యవహరించిన తీరును ఎంతమాత్రం సమర్థించను. ఈ దుశ్చర్యను కఠిన పదజాలంతో ఖండిస్తున్నాను" అని ప్రముఖ రచయిత జావెద్ ఆక్తర్ అన్నారు. ఇది కేవలం నుస్రత్ పర్వీన్, నితీష్‌కుమార్ సంఘటనకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు.ఇది రెండు రకాల పీడనల మనస్తత్వానికి సంబంధించినది, ఒకటి ప్రధానమైనది, స్త్రీలను చులకనగా, వివక్షతతో చూసే మనస్తత్వం. రెండోది మతతత్వ దృక్పథంతో చూసేది. వీటి రెండింటినీ సమర్థించే ఆలోచనా ధార కలిగిన పాలకులే నేడు పరిపాలన చేస్తున్నారు. పురుష అహంకారం, మత దురహంకారం రెండూ మనదేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. బీజేపీతో అంటకాగుతున్న మిగతా ప్రాంతీయ పార్టీలు, నాయకులు కూడా ఇలాంటి చర్యలు ఖండించడానికి ముందుకు రాకపోవడం, రాజీపడటం నేటి విషాదం. అయితే ప్రతిపక్షాలంతా ముక్తకంఠంతో నితీష్ చర్యను ఖండించారు. హక్కుల సంఘాలూ వ్యతిరేకించాయి. ప్రజాస్వామ్యము, రాజ్యాంగం హక్కులను కాలరాస్తున్న నేటి పాలకుల చర్యలను ప్రజలు అర్థం చేసుకుని తిప్పికొట్టాలి. లేకుంటే నాటి దుశ్శాసన పర్వం పునరావృతమవుతుంది. అందుకే "చీర లాగినా, హిజాబ్ గుంజినా, అది వస్త్రాపహరణమే/నాడు దుశ్శాసనుడైతే/నేడు శాసనుడు" అని కవి షుకూర్ కవిత్వీకరించారు.

## జిల్లాలో 26వేల మెట్రిక్ టన్నుల
# ఎరువుల పంపిణీకి ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి

ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న నానో యూరియా, నానో డి.ఎ.పిలను కూడా వినియోగించుకోవాలని, జిల్లాలోని కో-ఆపరేటివ్ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్ ఫెడ్ గోదాములు, ప్రైవేట్ రిటైల్/హోల్ సేల్ డీలర్ల వద్ద ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు.అధిక ధరలకు అమ్మితే చర్యలు:ఎరువుల విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ప్రాంతాలకు మళ్లించినా లేదా ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినా ఎరువుల నియంత్రణ చట్టం-1985 ప్రకారం లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు బస్తాలపై ఉన్న ధరను గమనించి, కొనుగోలు చేసిన వెంటనే డీలర్ల నుంచి తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు.

## క్రీడా స్ఫూర్తితో ఉన్నత
# శిఖరాలకు ఎదగాలి

- శ్రీకాకుళం రీజనల్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2025
- క్రీడా కోట ద్వారా ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు అవకాశం
- ఉత్తరాంధ్రలో త్వరలో వివిధ పరిశ్రమలు స్థాపన..
- నైపుణ్యత పెంచుకోండి. నైపుణ్యం ఉంటే మన ప్రాంతంలో నే ఉపాధి అవకాశాలు
- మన ప్రాంతంలోనే అవకాశాలు - శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**నవతరం -శ్రీకాకుళం:**

క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య శాఖ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2025 శ్రీకాకుళం జోనల్ లెవెల్ క్రీడల్లో అవార్డ్స్ ప్రధానోత్సవ ప్రోగ్రాంలో ఎచ్చర్లఎమ్మెల్యే ఎన్ ఈశ్వరరావు తో కలిసి,ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో ఉన్నత విద్యకు ప్రభుత్వ ఉద్యోగాలకు క్రీడాకోట ద్వారా అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. నైపుణ్య విద్యను ఆంటీ పుచ్చుకుంటే ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్రలోనే పుష్కలంగా ఉన్నాయని, క్రీడల్లో మరింత రాణించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

శ్రీకాకుళం జిల్లా రీజినల్ లెవెల్ క్రీడా పోటీల్లో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, నాలుగు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు.

పలువురు విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు, గ్రూపు క్రీడల్లో, వ్యక్తిగత క్రీడల్లో విద్యార్థులకు అవార్డులో ప్రశంస పత్రాలతో అభినందించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్,పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, పిడి, క్రీడాకారులు, విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేత్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం

**నవతరం -శ్రీకాకుళం:**

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి జి. సూర్య ప్రకాష్ తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ (మెన్) సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ సమావేశంలో సభాధ్యక్షులు జి.సూర్యప్రసాద్, వినియోగదారుల హక్కుల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరుగుతుందిని వినియోగదారుల హక్కుల కొరకై చట్టబద్ధత కల్పించు జరిగిందని, ఆ దినాన్నే జాతీయ వినియోగదారుల దినంగా డిసెంబరు 24న ప్రతిఏటా జరుపుకుంటామని తెలిపారు. వినియోగదారునికి హక్కుల తో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని గుర్తు చేశారు. వాటిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు లీగల్ మెట్రాలజీ, ఫుడ్ కంట్రోల్, డ్రగ్ కంట్రోల్, రోడ్డు రవాణా సంస్థ, జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్స్, శాఖలకు సంబంధించి వినియోగదారులకు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వినియోగదారులు కొనుగోలు చేయుచున్న ఏ వస్తువైన ధర మరియు వాటిని తయారు చేయు డేట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకొని కొనుగోలు చేయాలని సూచించారు. తూనికలు కొలతలకు సంబంధించి మోసాలను గమనించి వినియోగదారులు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, పి.చిన్నమ్మ తెలిపారు. మనం తీసుకునే ఆహార వస్తువులు ఏది మంచో ఏది చెడు గ్రహించి చిరుతిండ్లుకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని వినియోగదారులు ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, లక్ష్మీనారాయణ తెలిపారు. డ్రగ్స్ కంట్రోల్ ఏడి హరిచంద్ర రావు మాట్లాడుతూ క్వాలిటీ మెడిసిన్స్ విషయంలోనూ, కనీస అవసరాల మందులు స్టోరేజీ పరిశీలన, ఎమ్మార్పీ విషయాల్లో ప్రభుత్వం నిబంధనలకు అనుకూలంగా చేయుట జరుగుతుందని తెలిపారు.

రోడ్డు రవాణా సంస్థ డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని సేవలు డిజిటల్ విధానంలోనే జరుగుతున్నాయని టిక్కెట్ రిజర్వేషన్ నుండి వస్తు సామాగ్రి తరలించేంత వరకు ప్రతీ విషయంలోనూ డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని సంస్థ ద్వారా అనేక సేవలు అందించుటలో కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. తదుపరి చీఫ్ గెస్ట్ గా విచ్చేసిన ఆర్. చిరంజీవి - అధ్యక్షులు, జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్, వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని వినియోగదారుల హక్కుల గూర్చి తెలుపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. మొట్టమొదటిగా అమెరికా దేశంలో ప్రారంభమైన ఈ వినియోగదారుల హక్కుల పోరాటం, మన దేశ పార్లమెంట్లో 1996లో చట్టరూపం దాల్చిందని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటో మరియు నగదు పురస్కారాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవిబాబు ఇతర అధికారులు, విద్యార్థులు మరియు వినియోగదారులు పాల్గొన్నారు.

## గ్రామ కంఠస్థలం ఇతర వర్గాలకు
# మంజూరు చేయవద్దు

**నవతరం -మందస**

మందస పట్టణంలో ఉన్న గ్రామ దేవత అన్నపూర్ణమ్మ ఆలయం ముందు భాగంలో ఉన్న గ్రామకంఠం స్థలాన్ని కుల సామాజిక వర్గాలకు గానీ, వ్యక్తిగతంగా గానీ మంజూరు చేయవద్దని మందస మేజర్ పంచాయతీ సర్పంచ్ చెరుకుపల్లి ఎల్లమ్మ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులు బుధవారం మందస డిప్యూటీ తాసిల్దార్ ఆర్.రామకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్నపూర్ణమ్మ గ్రామ దేవత ఆలయం ముందు ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీ గ్రామకంఠం స్థలం ఆలయానికి ఎంతో కీలకమైనదని తెలిపారు. ప్రతిరోజూ ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నిలిపేందుకు, చెప్పులు పెట్టుకునేందుకు ఈ స్థలాన్ని వినియోగిస్తున్నారని చెప్పారు. అలాగే ప్రతి ఏడాది మే 26న జరిగే ఆలయ వార్షికోత్సవం, ఐదేళ్లకోసారి నిర్వహించే గ్రామ దేవత ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలన్నీ ఇదే స్థలం కేంద్రంగా జరుగుతాయని వివరించారు.ఈ గ్రామకంఠం స్థలం మీదుగానే ఆలయం వెనుక భాగంలో ఉన్న దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన సుమారు ఒక ఎకరా స్థలానికి వెళ్లే రహదారి ఉందని, లక్షలాది మంది భక్తులు గ్రామ దేవత సంబరాల సందర్భంగా ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తారని పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన స్థలంలో సామాజిక భవనాల నిర్మాణానికి



లేదా వ్యక్తిగత మంజూర్లకు రెవిన్యూ శాఖ అనుమతులు ఇస్తే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని, ఆలయ అభివృద్ధి కుంటుపడు తుందని, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ స్థలాన్ని ఇప్పటికే సర్వేయర్లు సర్వే చేశారని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆలయం ముందు ఉన్న ఈ గ్రామకంఠం స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మంజూరు చేయకుండా, ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు ప్రభాకర్ పట్నాయక్, బి.సాంబమూర్తి, వి.వి.రమణమూర్తి, మల్లారెడ్డి రాజు, తలగాన హరికృష్ణ, పొందర దుద్దిస్టి పాత్రో, అల్లాడ తాతయ్య, అల్లాడ ఈశ్వరరావు, జగన్నాథ బెహరా, ఆలయ అర్చకులు గోవిందు కహాల్య తదితరులు పాల్గొన్నారు.


## నేటి దూడలే రేపటి
# మన పాడి సంపద..

**నవతరం- పోలాకి**




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు గణాభివృద్ధి సంస్థ మరియు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పోలాకి మండలం, కుసుమపోలవలస గ్రామంలో ఏర్పాటు చేసిన లేగ దూడలు ప్రదర్శన కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు మరియు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గ అర్చన గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాడి పశువుల సంరక్షణ విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారం రాగానే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పాడి పశువుల సంరక్షణ మరియు అభివృద్ధి కొరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా లింగ నిర్ధారిత వీర్యం సబ్సిడీ ద్వారా 150 రూపాయలకే అందిస్తున్నారని రైతులు ఈ అవకాశాన్ని సద్విని చేసుకొని, ఆడదూడలు పెంపుదలకు సహకరించాలని సూచించారు.లేగ దూడలు ప్రదర్శనలో మేలు జాతి లేగ దూడలు పెంపకదారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, సూరపు నారాయణ దాసు, సర్పంచ్ తర్ర లక్ష్మినారాయణ, భైరి వెంకట్రావు, చిట్టి సింహాచలం, రావాడ గణపతిరావు, భైరి అచ్చెన్నాయుడు,పైల రాజేంద్ర నాయుడు, మరియు పోలాకి మండల పశు వైద్యాధికారులు, సిబ్బంది కూటమి నాయకులు కార్యకర్తలు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు త్యాగాలకు ప్రతిరూపం - క్రిస్మస్



క్రీస్తు ఆసియా ఖండంలో యూదయ దేశంలోని బెత్లహేము గ్రామంలో జన్మిం చాడు. 'బెత్లహేము' అనగా రొట్టెల గృహమని అర్థం. ఈ బెత్లహేము ప్రపంచ పటంలో మధ్యస్థంగా ఉంటుంది కనుక సాక్షాత్తు భగవంతుడే తన ప్రతిని ధిగా క్రీస్తును ఈ భూలోకం మీదకు పంపించా డంటారు. క్రీస్తు జననంలోని ముఖ్యోద్దేశ్యం పావుల నుద్ధరించడం. ఈ భూమ్మీద పుట్టినవారు ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సమయంలో పాపం చేసినవారే... పాపంవల్ల వచ్చే ఫలితం నరకం, అలాంటి నరకానికి లోనుకావల్సిన నరజాతిని రక్షించడానికి రక్షకుడైన క్రీస్తు ఆవర్భవించాడు. ప్రపంచంలో ఎక్కువశాతం మంది ప్రజలు జరుపుకునే పవిత్రమైన పండుగ క్రిస్మస్. క్రైస్తవులు ఈ పండుగను ఎంతో ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. వీరి ప్రార్థనా లయాలైన చర్చిల వద్దా, నివాస గృహాలవద్దా రంగురంగు దీపాలతో అలంకరిస్తారు. క్రైస్తవులందరూ ఉదయమే లేచి చర్చిలకు వెళ్ళి ఏస య్యను ప్రత్యేక ప్రార్ధనలు, ఆరాధనా గీతాలతో కొలుచుకుంటారు.పాపులను పరిరక్షించేందుకు పరలోకంనుంచీ దిగివచ్చిన ప్రభువు ఏసు. ఏసుక్రీస్తు అంటే కరుణ. శాంతి, ప్రేమ, జాలి, అహింస, త్యాగాలకు ప్రతిరూపం. అలాంటి కరుణామయుణ్ని సైతం కరడు కట్టిన క్రౌర్యానికి బలి చేసిందానాటి మూర్ఖలోకం. పడిపోతున్న మానవతా విలువలను పునరుద్ధరించేందుకు ప్రయత్నించిన పరిశుద్ధాత్ముడినే దారుణంగా హింసించి, శిలువవేసి ప్రపంచానికి దూరం చేశారా పాపాత్ములు. తననంత వేధించి చంపుతున్నా వారందరిని కరుణిం చమని దైవాన్ని ప్రార్థించాడా మహనీయుడు. కాబట్టే ఆయన ప్రభువుగా అందరిగుండెల్లో ఆరాధ్యుడయ్యాడు.ఏసంటే రక్షకుడు, క్రీస్తంటే అభిషిక్తుడనంటారు. మానవులను రక్షించేందుకు, మృగ్యమవుతున్న విలువలను మనిషిలో పాదు కొలిపేందుకు శిలువను మోసేందు కైనా సిద్ధపడ్డ త్యాగ మూర్తి ఏసు. కొన్ని వందలసంవత్సరాల క్రితం మరియ అనే కన్యకు జన్మించాడు. ఏసు. ఈ విషయాన్ని దైవదూత మరియకు ముందుగానే తెలియ చేస్తూ పుట్టిన శిశువుకు ఏసుక్రీస్తని పేరు పెట్టమని సూచిస్తాడు. ఇదే సంగతి మరియ భర్త జోసఫెకూ చెబుతాడు. అప్పుడతను భార్యతో తమ పూర్వీకుల స్థలమైన బెత్లహేం కు వెడతాడు. అయితే, అప్పటికే నెలలు నిండిన మరియ మార్గ మధ్యంలోని ఒక పశు వులపాకలో సర్వలోకానికి ప్రభువైన ఏసుకు జన్మనిస్తుంది.క్రీస్తు పుట్టుకలోని ఆంతర్యం పాపుల్ని రక్షించడమే కాదు మన పాప కర్మల నుంచి రక్షించడంగా భావించి సత్కర్మలు చేయాలి. మంచిని పెంచి చెడును త్యాజించాలి.ఇదే సమయంలో ఆకాశంలో కోటికాంతులతో దివ్యమైన నక్షత్రం ప్రకాశిస్తుంది. ఒక దేవదూత కూడా ప్రత్యక్షమై తూర్పు దేశపు జ్ఞానులకు 'మీ రాజు పుట్టాడని..... అక్కడకు వెళ్ళమని, మీక్ నక్షత్రం దారిచూపుతుందని' చెబుతాడు. ఆ జ్ఞానులు నక్షత్రం వెంట నడచుకుంటూ ఆ శిశువున్న చోటికి వచ్చి ప్రార్థనలు చేసి కానుకలు సమర్పించుకుంటారు. అదే సంప్రదాయంగా ఈరోజు క్రైస్తవులు ప్రార్థనలూ, బైబిలు పఠనంతో పరిశుద్ధంగా గడుపుతారు. క్రిస్మస్ చెట్టుల జీవితం కళకళలాడాలంటే ప్రతి వారి హృదయంలో క్రీస్తుకు చోటు ఇవ్వాలన్న సందేశం క్రిస్మస్ చెట్టు చెబుతుంది. క్రిస్మస్ చెట్లు పెట్టి క్రొవ్వొత్తులు, చాక్లెట్లు, బెలున్లతో అలంకరించి కేకులు పంచుతూ కోలాహలంగా పండుగ చేసుకుంటారు. బాలయేసు. రాకకోసం ప్రత్యేకప్రార్థనలు చేస్తారు. క్రిస్మస్ ముందురోజు అర్థరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు. చేస్తారు. మనసుల్లో పేరుకు పోయిన మాలిన్యాన్ని తరిమికొట్టాలని, ప్రతీ హృదయం త్యాగబుద్ధితో మెలగాలని ప్రార్థిస్తారు. బంధుమిత్రులను కలిసి అభినందనలు తెలుపుకుంటారు.ఈ పండుగ మరో విశేషం క్రిస్మస్ తాత. ఈయన కోసం పిల్లలంతా ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తారు. క్రిస్మస్ తాత పిల్లలకెన్నో బహుమతులు, చాక్లెట్లు తెచ్చిస్తాడు. క్రిస్మస్ తాత శాంతాక్లాజంటే చిన్నపిల్లలందరూ మైమరచిపోతారు. ఏసుకి చిన్నపిల్లలంటే విపరీతమైన ఇష్టం... ఆయన పిల్లల్ని ఓదార్చి ముద్దుచేసేవాడు. దానికి గుర్తుగానే శాంతాక్లాజ్ విచిత్రమైన వేషధారణలతో పిల్లలను నవ్విస్తూ చేరదీసి ఆదరించేవాడుగా దర్శన మిస్తాడు. క్రిస్మస్ ముందురోజు రాత్రి శాంతాక్లాజ్ వేషం వేసుకుని ఊరంతా పాటలు పాడుతూ సందడి చేయడం ఓ ఆనవాయితీ వస్తోంది. క్రైస్తవులు క్రీస్తు జననమైన క్రిస్మస్ పండుగను మహోత్కృష్ట దినంగా పాటిస్తారు. ఈరోజే పోప్ తన అమూల్య సందే శాన్ని వినిపిస్తారు. ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రవచనాలు, శాంతి సందేశం ఎప్పటికీ ఆచరణీయమే. మంచిని పెంచేందుకు ప్రాణాలనే పణంగా పెట్టిన మహోన్నతుడు ఏసు. దారితప్పుతున్న ప్రజలకు ఆయన ఒక గొర్రెల కాపరి, త్యాగానికీ, అనురాగానికి నిలువెత్తు ప్రతీక. అందుకే ఆయన జన్మదినం లోకానికంతటికీ పర్వదినం.

యేసుకు గిట్టనివి :లిఅహంకారంతో చూసే కన్నూ, లిఎప్పుడు నోరు తెరిచినా కల్లలు మాట్లాడుటకు అలవాటు పడిననాలుకా, లితప్పుచేయని వారిని శిక్షించే చేతులూ, లి దురాలో చనల బందిఖానాలో పడి మగ్గుతుండే హృదయం, లిఎవరికో ఒకరికి లేదా అందరికీ దుఃఖాన్ని కలుగ జేయాలని పరుగు పెట్టి వెళ్ళే పాదాలు, లిఅబద్ధ సాక్ష్య ముతో కుటుంబాన్నీ, మిత్రుల్నీ, ప్రపంచాన్నీ కూడా వేరుచేస్తూండేవాడూ, లిఒకే తల్లి గూటినుండి పుట్టిన అన్నదమ్ముల మధ్య జగడములను మొలకెత్తింప చేసే వాడు అనే ఈ ఏడుగురు యెహోవాకు గిట్టరు. సత్క్రియలు ఆకలిగొన్నవారికి ఆహారం పెట్టండి. దప్పికగొన్న వారికి దాహంతీర్చండి. వస్త్రంలేనివారికి వస్త్రాన్ని ఇవ్వండి. రోగులనువారిని పరామర్శించండి. బీదలను, అనాథ లను ఆదరించండి. శత్రువులను ప్రేమించండి.మిమ్మల్ని ద్వేషించేవారికి కూడా మేలు చేయండి. మిమ్మల్ని శపించేవారిని కూడా దీవించండి. మిమ్మల్ని బాధించేవారికోసం ప్రార్థనచేయండి. ఈ సత్రియలను ఎవరైతే మనఃపూర్వకంగా జరిపిస్తారో వారే నాకిష్టులు. వారే పరలోకరాజ్యాన్ని స్వతంత్రించుకుంటారు. వారి పట్ల నా కృప నిరంతరముంటుంది. వారు దీర్ఘాయుష్మం తులై సుఖశాంతులతో వర్ధిల్లుతారు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



## ఫిర్యాదు చేయడానికి నిరాకరించిన హీరోయిన్

హీరోయిన్ నిధి అగర్వాల్ కు ఎదురైన చేదు అనుభవం గురించి అందరికీ తెలిసిందే. లులూ మాల్ లో ఆమెను ప్రభాస్ ఫ్యాన్స్ చుట్టుముట్టారు. దీంతో ఆమె తీవ్ర అసౌకర్యానికి గురైంది. అతి కష్టమ్మీద తన కారులోకి వెళ్లింది.దీనికి సంబంధించిన వీడియో కొన్ని రోజుల కిందట వైరల్ అయింది. అభిమానుల దుందుడుకు చర్యలపై అంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ సెన్స్ లేదంటూ కొంతమంది విరుచుకుపడ్డారు.ఈ మొత్తం వ్యవహారాన్ని సుమోటాగా తీసుకొని కేసులు నమోదు చేశారు పోలీసులు. మాల్ తో పాటు, ఈవెంట్ నిర్వహించిన ఆర్గనైజర్ పై కేసులు వేశారు. ఈ క్రమంలో నిధి అగర్వాల్ ను కూడా సంప్రదించారు.పోలీస్ కంప్లయింట్ ఇస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిధి అగర్వాల్ నిరాకరించింది. తను ఎవ్వరిమీద ఫిర్యాదు చేయనని తేల్చిచెప్పింది.నిధి నిర్ణయంతో సోషల్ మీడియాలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె కంప్లయింట్ చేసినట్టయితే, భవిష్యత్తులో మరో హీరోయిన్ కు ఇలాంటి అనుభవాలు ఎదురవ్వకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకునేవారని కొందరు అన్నారు.మరికొందరు మాత్రం హీరో ఫ్యాన్స్ అత్యుత్సాన్ని అర్థం చేసుకొని, నిధి పెద్ద మనసుతో వ్యవహరించిందని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో అభిమానులే కాస్త సంయమనంతో వ్యవహరిస్తే అందరికీ మంచిది.

## ఛాంపియన్.. దండోరా.. శంబాలా.. విడుదల తర్వాతే

టఫ్ కాంపిటీషన్ లో విడుదలవుతున్నాయి ఛాంపియన్.. దండోరా.. శంబాలా సినిమాలు. ఛాంపియన్ కు పెద్ద బ్యానర్ అండ వుంది. దండోరాకు మంచి కంటెంట్ అని టాక్ వుంది. శంబాలా సినిమా బాగా వచ్చిందట అనే టాక్ ఇండస్ట్రీ లో వుంది.ఇలా వున్నా కూడా ఏ సినిమాకు ఓపెనింగ్ గట్టిగా తెగుతుందా అనే అనుమానం వుంది. ప్రీ రిలీజ్ బజ్ ఎంత వుంది అన్నది పక్కన పెడితే క్రిస్మస్, న్యూ ఇయర్, పొంగల్ కావడంతో జనాల డబ్బులు వేరే ఖర్చుల వైపు వుంటాయి.సినిమా అన్నది వాటి తరువాతే. కానీ బాగుంది అనే టాక్ వస్తే మాత్రం కచ్చితంగా సినిమా కు ఖర్చు పెట్టడానికి వెనుకాడరు.అందువల్ల ఈ మూడు సినిమాలు మంచి యునానిమస్ టాక్ ను. అది కూడా పీక్స్ లో తెచ్చుకోవాల్సి వుంటుంది. అప్పుడే జనాలు ఇటు చూస్తారు. తప్పు సినిమాలది కాదు. విడుదల టైమ్ ది.ఛాంపియన్ కు ఓ సాంగ్ వైరల్ అయింది. ట్రయిలర్ కు అప్లాజ్ వచ్చింది. దండోరా ట్రయిలర్ లో కంటెంట్ జనాలకు నచ్చింది. శంబాలా సినిమా రెండో ట్రయిలర్ రాబోతోంది. ఇప్పటికే వచ్చిన ఓ ట్రయిలర్, యూనిట్ చేస్తున్న ప్రచారం దానికి ప్లస్ అయంది.ఇక మూడింటికి మిగిలింది మౌత్ టాక్ మాత్రమే.



# శ్రీ చైతన్యలో తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి క్రీడా పోటీలు






**నవతరం -శ్రీకాకుళం:**

శ్రీ చైతన్య ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన న్యూ ఎడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా బలగనందుగల శ్రీ చైతన్య లో తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ సుజాత గారు విచ్చేశారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మధ్యలో అవీనవభావ సంబంధం వల్లే విద్యార్థులు అభివృద్ధికి తోడ్పడతాయ అని ఆవిడ పేర్కొన్నారు. న్యూ ఎడాప్షన్ ప్రోగ్రాంలో కార్యక్రమాలు, వాటి ఆవశ్యకతను తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ ఇంద్రమౌళి వివరించారు.

విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలను రీజనల్ ఇన్చార్జి రామినాయుడు గారు సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడంలో శ్రీ చైతన్య ముందు ఉంటుందని ఏజీఎం సురేష్ గారు పేర్కొన్నారు. క్రీడా కార్యక్రమాల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు ఎంఈఓ సుజాత గారి చేతుల మీదుగా బహుమతులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ బాలరాజు, డీన్ జగదీష్,సి ఇంచార్జ్ మల్లేశ్వరరావు, ప్రైమరీ ఇన్చార్జ్ ఉషారాణి, ఏవో శ్రీనివాస్, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

### పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై డీఎల్ఎస్ఏ అవగాహన సదస్సు




**నవతరం -శ్రీకాకుళం:**

నేటి పర్యావరణ పరిరక్షణే రేపటి తరాలకు భద్రతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. పాన్ ఇండియా ఎన్విరాన్‌మెంటల్ లీగల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో పర్యావరణ, పారిశ్రామిక అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబంధనలు పాటించడం అత్యవసరమన్నారు. పర్యావరణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులను కోరారు.

అనంతరం ఈ పథకానికి సంబంధించిన గోడ పత్రికను ఆయన విడుదల చేశారు. పరిశ్రమల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. పర్యావరణాన్ని కలుషితం చేయడం వల్ల కలిగే చట్టపరమైన ఇబ్బందులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కరుణశ్రీ, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## బ్రాహ్మ శ్రీ చాగంటి గారితో విద్యా ముఖాముఖి

- వేల మంది విద్యార్థులతో సభా ప్రాంగణం
- ప్రేరణాత్మక దివ్య వచనాలతో విద్యార్థులలో ఆత్మ విశ్వాసం నింపిన చాగంటి వారు



నవతరం -శ్రీకాకుళం:

జీవన విలువలు, నైతికత, సంస్కారం, ధర్మబద్ధమైన ఆలోచనలతో కూడిన విద్య యే విద్యార్థి జీవితానికి నిజమైన పునాది అని నిరూపించేలా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలంలోని ఎన్. ఈ. ఆర్.స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ ఈరోజు ఒక సాక్షిగా నిలిచింది. ఉత్తరాంధ్ర లో ఒక చరిత్రాత్మక విద్యా సంకల్పం నకు వేదిక గా నిలిచింది. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలనే ఉన్నత సంకల్పంతో ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదుటి ఈశ్వరరావు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా ముఖాముఖి కార్యక్రమం మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో 25 వేల మంది తో దిగ్విజయంగా, దేవ యజ్ఞం గా సాగింది. ఈ మహత్తర కార్యక్రమం లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా నైతిక విలువల సలహాదారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు విద్యార్థుల హృదయాలను తాకేలా, వారి జీవితాలకు దారి చూపేలా స్ఫూర్తిదాయకమైన ప్రవచనాలను అందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ధర్మనిష్ఠను నాటేలా అమృత వాక్యాలను అందించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, విలువలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో ఇంత గొప్ప కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు గారిని చాగంటి కోటేశ్వరరావు గారు ప్రత్యేకంగా అభినందించారు. ఇటు వంటి నాయకులు సమాజానికి మార్గ నిర్దేశకులుగా నిలవడం శుభ పరిణామం అన్నారు. ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు గారు మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదుర్కొనే సందిగ్ధాలను ధర్మబద్ధంగా పరిష్కరించుకోవాలని బోధిస్తూ.. మనల్ని మేల్కొలిపి, మన ఆలోచనలకు దిశనిచ్చే అసాధారణ శక్తిగా నిలిచిన బ్రాహ్మ శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి లాంటి మహనీయులు మన ముందు ఉండడం మనందరి అదృష్టం అన్నారు. ఎన్.ఈ. ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నడుకుదిటి తేజ గారి సారథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల సమన్వయంతో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ఈ కార్యక్రమం లో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గారు, శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ పాల్గొన్నారు.



## వ్యాధిగ్రస్తులకు అన్నివేళలా అండగా ఉంటాం

### క్రిస్మస్ వేడుకల్లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతరం -శ్రీకాకుళం:**

కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటామని సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం స్థానిక కరుణ సమాజంలో రెడ్ క్రాస్ సంస్థ మరియు ఆర్ఫ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.క్రీస్తు బోధనలు అనుసరణీయమని, పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు చెప్పారని ఆయన పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతూ వారియొక్క సమస్యను తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తుల పెన్షన్, మరుగుదొడ్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, రేషన్ తదితర విషయాల పై ఆయన చర్చించారు. కుష్టు వ్యాధిగ్రస్తుల ఎటువంటి సమస్యలు లేకుండా,అండగా ఉంటామన్నారు. అనంతరం 35 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు రెడ్ క్రాస్ మరియు ఆర్ఫ్ సేవ సంస్థ సౌజన్యంతో కందిపప్పు, ఆయిల్, పంచదార, బియ్యం మరియు చీరలు, టవల్స్, దుప్పట్లు, బట్టలు, జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.క్రిస్మస్ కేకును కట్ చేసి పిల్లలకు తినిపించారు.క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి జగన్ మోహన్ రావు, సెక్రటరీ మల్లేశ్వర రావు, , అప్ హోల్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ తిమోతి, రెడ్ క్రాస్ జిల్లా ఎం.సీ. మెంబర్లు, డాక్టర్ నిక్కు అప్పన్న, నూక సన్యాసిరావు, హరి సత్యనారాయణ, చిన్మయిరావ్, జి.రమణ, సత్యనారాయణ, చైతన్యకుమార్, ఉమా శంకర్, వెంకటరమణ, చిన్నారావు, కరుణ సమాజం కుటుంబాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ.. క్షేత్రస్థాయిలో ప్రచారం

- నూతన సంవత్సరానికి ముందే దువ్వాడ ఆధ్వర్యంలో క్యాలెండర్.. స్వీట్స్ బాక్సులు పంపిణీ
- పలాస రూరల్ మండలంలో పలు గ్రామాలలో పలాస జిల్లా సాధన కమిటీ బృందానికి విశేష ఆదరణ

**నవతరం-పలాస**

జిల్లా కేంద్రంగా పలాసను ప్రభుత్వం ప్రకటించాలంటూ ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా) నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా ఉద్యమానికి క్షేత్రస్థాయిలో కూడా విశేష ఆదరణ లభిస్తుంది. బుధవారం పలాస రూరల్ మండలం కేదారిపురం, ఈదురపల్లి, గోదారి పేట, చినంచల, రాజగోపాలపురం, అల్లుకోల, కంబిరిగాం, నారాయణపురం, బ్రాహ్మణ తర్ల, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ..

నూతన సంవత్సర క్యాలెండర్.. స్వీట్ బాక్స్ చొప్పున ఇంటింటా పలాస జిల్లా సాధన కమిటీ బృందం చే ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పలాస జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించే వరకు తాము సంపూర్ణంగా మద్దతు తెలుపుతామని, అందుకు ఎటువంటి పోరాట ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామంటూ వివిధ గ్రామస్తులు సాధన కమిటీ బృందానికి అండగా నిలుస్తామంటూ హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా సుదీర్ఘ స్వప్నంగా ఉన్న పలాసను జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని..

అందుకు ఈ కమిటీకి సారథ్యం వహిస్తున్న





దువ్వాడ శ్రీధర్ ( బాబా ) తో కలిసి ప్రయాణం చేయడానికి అన్నివేళలా అందుబాటులో ఉంటామని పలు గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, మహిళలు, యువత, వ్యవసాయ కూలీలు, రైతులు, విద్యార్థులు తగు రీతిలో హామీ ఇచ్చారు. 2026 నాటికి మరింత స్థాయిలో ఈ ఉద్యమ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు దువ్వాడ శ్రీధర్ ( బాబా ) కార్యాచరణకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు లభించడం విశేషం.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli**, Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**